RNI No :TELTEL2022/83073


# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 220 | జులై 29, 2025 | వెల : రూ.3-00

## వరంగల్ నార్కోటిక్ డీఎస్పీగా రమేష్ కుమార్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**



వరంగల్ నార్కోటిక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పీ. రమేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో చేసిన డీఎస్పీ కే. సైదులు టీజీఏఎన్ బీ హెడ్ ఆఫీస్ హైదరాబాద్‌కు బదిలీ కావ డంలో ఆయన స్థానంలో నార్కోటిక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పీ. రమేష్ కుమార్ సోమ వారం బాధ్యతలు స్వీకరించారు.



# ప్రతి పనికో రేటు..?

- తహశీల్ ఆఫీసులో దస్తావేజు లేఖరుల హవా!
- సామాన్యులకు కొర్రీలు.. లేఖరులకు మాత్రం క్షణాల్లో పనులు!
- సదరు వ్యక్తులకు, తహశీల్దార్‌కు మధ్య ఉన్న మతలబు ఏమిటో?
- ఆఫీసు లోపల దగ్గరుండి పనులు చేయిస్తున్న లేఖరులు!
- ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికుల వేడుకోలు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండల తహశీల్ ఆఫీసు దస్తావేజు లేఖరుల ఆధీనంలోకి వెళ్లిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు కార్యాలయంలో పని తీరు జిల్లాతో పాటు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జరుగుతోందని పేర్కొంటున్నారు. తహశీల్ ఆఫీసులో దస్తావేజు లేఖరులు తమ హవా నడిపిస్తున్నారని, ప్రతి పనికో రేటు అన్నట్టు ఇల్లంతకుంట తహశీల్దార్ కార్యాలయం తయారయిందని వాపోతున్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సామాన్యులు లోనికి వెళ్తే 'మీరు ఎందుకు వచ్చారు?' అని అడిగే సిబ్బంది.., దస్తావేజు లేఖరులు వస్తే సప్పుడు చేయడం లేదని జనం చెబుతున్నారు. భూ భారతిలో సామాన్యుడు స్లాట్ బుక్ చేసుకుని వెళ్తే.. "ఈ పేపర్ లేదు.. ఆ పేపర్ లేదు" అంటూ తిప్పుతున్న వైనాలు ప్రతి రోజూ కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. అదే పని ఒక దస్తావేజు లేఖరికి అప్పగిస్తే క్షణాల్లో పని అవుతుండటంతో జనం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తాము వెళ్తే కొర్రీలు పెడుతున్నారని వాపోతున్నారు.

### లేఖరులకే ఆఫీసులో ప్రయారిటీ?

పెద్ద సారును కలవాలంటే తాము వేచి చూడక తప్పట్లేదని, స్లాట్ బుక్ చేస్తే సాయంత్రం అయినా తమ పని కావట్లేదని కొందరు వెల్లడిస్తున్నారు. అదే బ్రోకర్లతో వెళ్తే వెంటనే పని అవుతోందని ఆరోపణలు చేస్తున్నారు. కొందరు కింది స్థాయి సిబ్బంది కంటే దస్తావేజు లేఖరులకే కార్యాలయంలో ప్రాధాన్యత ఎక్కువ ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. 'మీకు పాస్ బుక్ లేదని, లేదంటే మీ భూమి పైన అభ్యంతరాలు ఉన్నాయని, మీకు పది గుంటల లోపు భూమి రిజిస్ట్రేషన్ ఉంటే సారు చేయరని, ఏదో ఒక సాకు చెపుతూ'.. 'సారుకు ఇంత ఇవ్వాలని ముందు మాట్లాడుకున్నాకే' స్లాట్ బుక్ చేస్తుండటం గమనార్హం. స్లాట్ బుక్ చేసుకున్న సమయం ప్రకారం కాకుండా ఇష్టం వచ్చిన సమయంలో రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు.

### వారు లేకపోతే నో వర్క్!

గతంలో దస్తావేజు లేఖరులు ఎందుకు వస్తున్నారని అడిగితే.. వాళ్లు ఇక నుంచి రారని చెప్పి కొన్ని రోజుల పాటు కార్యాలయానికి రానివ్వకుండా సక్రమంగా ఆఫీసును నడిపించారు. కానీ, ఇప్పుడు వారు లేనిదే పని ముందుకు సాగట్లేదు. దస్తావేజు లేఖరులు తహశీల్దారు కార్యాలయంలో ఎక్కువ సమయం గడుపుతుండడంతో సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. భూ భారతి ఆపరేటర్ చుట్టూ నిలబడి దస్తావేజు లేఖరులు దగ్గరుండి పనులు చేపిస్తున్నారని, ఆపరేటర్ కు ఇబ్బంది అవుతుందని కొన్ని సార్లు వీళ్లే ఫొటోలు తీస్తూ, వేలిముద్రలు, సంతకాలు చేపిస్తూ, కొన్ని సార్లు పేపర్లు ప్రింటు తీసి, పత్రాలను స్కాన్ చేస్తున్నారు. ఈ సందర్భంలో 'మీరెందుకు చేపిస్తున్నార'ని ఎవరైనా ప్రశ్నిస్తే 'తమకు తహశీల్దార్ చెప్పాడని, ఆ పని తామే చేయాలి' అంటూ దస్తావేజు లేఖరులు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

### ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి

ఎవరైన సొంతంగా స్లాట్ బుక్ చేసుకుని వస్తే, ఈ డాక్యుమెంట్ ఎవరు బుక్ చేశారని భూ భారతి ఆపరేటర్ అడుగుతున్నారని కొందరు చెబుతున్నారు. సర్వర్ రావట్లేదని వారిని సాయంత్రం వరకు వేచి ఉండమంటున్నాడు. తాము చెప్పిన వారి దగ్గరే స్లాట్ బుక్ చేసుకోవాలని వారు చెప్తుండటం కొసమెరుపు. కాగా, తహశీల్దార్, దస్తావేజు లేఖరుల మధ్య ఏదో మతలబు ఉందని మండల ప్రజలు గుసగుసలు పెడుతున్నారు. ఉన్నతాధికారులు తహశీల్ ఆఫీసులో కార్యకలాపాలపై దృష్టి సారించాలని, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

# తహశీల్దార్ కార్యాలయానికి రూ.5 లక్షలు మంజూరు



- "వేద న్యూస్" కథనానికి ఉన్నతాధికారుల స్పందన..

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



వేద న్యూస్

పత్రాలకు భద్రత కరువు..!

తహసిల్దార్ కార్యాలయానికి ప్రహరీ నిర్మించేది ఎన్నడు..?

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :

వేములపల్లి మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రక్షణ గోడ లేకపోవడంతో తహసిల్దార్ కార్యాలయానికి సంబంధించిన ముఖ్యమైన పత్రాలకు భద్రత కరువైంది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు వివిధ సమస్యల కోసం తహసిల్దార్ కార్యాలయానికి రాకపోకలు కొనసాగిస్తున్నారు అయితే కార్యాలయంలో పశువులు, పందులు సరిస్రూపాల భయం ప్రజలకు వెంటాడుతుంది. అంతేకాకుండా ప్రహరీ గోడ లేకపోవడంతో రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు పక్కన తహశీల్దార్ ఉండడం కార్యాలయానికి సెలవు దినం నా వాహనదారులు, ప్రజలు విశ్రాంతి కోసం రాకపోకలు కొనసాగిస్తుండడంతో ముఖ్యమైన పత్రాలకు భద్రతకు సంబంధించిన అధికారులు బిక్కుబిక్కుమంటున్నారు. తహసిల్దార్ కార్యాలయంలో సౌకర్యాలు మెండుగా ఉన్న చెత్త పేరుకుపోయి ఉండడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. సమస్యలకు నిలయంగా ఉన్న వేములపల్లి తహసిల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే,ఉన్నతాధికారులు దృష్టి సారించి తహసిల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ తక్షణమే నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

"వేద న్యూస్" తెలుగు దినపత్రిక ఈ నెల 17న తన ప్రధాన సంచికలో ప్రచురించిన కథనానికి స్పందన వచ్చింది. ఉన్నతాధికారి క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారు. పత్రాలకు భద్రత కరువు!" అనే శీర్షికన " వేద న్యూస్ " తెలుగు దినపత్రిక ప్రచురిం చిన వార్తా కథనానికి ఆఫీసర్లు స్పందించారు. తహసి ల్దార్ కార్యాలయాన్ని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ సందర్శించారు. తహసిల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. తహసిల్దార్ కార్యాలయంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్.. సమస్యలను సబ్ కలెక్టర్ కు వివరించారు. ప్రహరీ నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేశారు. ప్రహరీ నిర్మాణంకు సర్దుబాటు కాకుంటే ఇంకా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు తహసిల్దార్ కార్యాలయ ప్రాంగణాన్ని కలియ తిరిగారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారానికి కృషిచేసిన "వేద న్యూస్" తెలుగు దిన పత్రికకు మండల ప్రజలు, రైతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వేద న్యూస్ పత్రిక ప్రజల సమస్యలు ప్రభుత్వం,అధికారుల దృష్టికి తీసుకపోవడంలో ముందువరుసలో నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఆదర్శనీయుడు జైపాల్ రెడి

**హైదరాబాద్, వేదన్యూస్ :**



కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్ రెడ్డి నేటి తరానికి ఆదర్శనీయుడని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు మార్గ్‌లోని జైపాల్ రెడ్డి ఘాట్ వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డితో కలిసి పుష్పాంజలి సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ మాట్లాడుతూ.. జైపాల్‌రెడ్డి వివిధ హోదాల్లో పని చేసి ప్రజలకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. రాజకీయాల్లో విలువలు, నిబద్ధత, సేవాతత్వం కలిగిన నేత జైపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చురుకుగా పాల్గొని, రాష్ట్ర సాధన కోసం పోరాడరన్నారు. అప్పటి నేతలకు ఆయనే మార్గ నిర్దేశకులుగా ఉన్నట్లు చెప్పారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం అనే పదానికి నిదర్శనం స్వర్గీయ జైపాల్ రెడ్డి అని ఆయన పేర్కొన్నారు.




## ఎంబీబీఎస్ సీట్ల స్థానికతపై తెలంగాణ హైకోర్టు కీలక తాత్కాలిక తీర్పు

**వేదన్యూస్, హైదరాబాద్ :**

ఎంబీబీఎస్ సీట్ల స్థానికతపై తెలంగాణ హైకోర్టు కీలక తాత్కాలిక తీర్పును ఇచ్చింది. కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్ కౌన్సెలింగ్ దరఖాస్తుదారులను స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు ఆదేశించింది. తుది తీర్పు వచ్చే వరకు రిజిస్ట్రేషన్‌లో చేర్చాలని ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు తీర్పుతో సుమారు 100 మంది అభ్యర్థులకు తాత్కాలిక ఊరట లభించింది. జూలై 30వ తేదీతో రిజిస్ట్రేషన్ ముగియనుండటంతో హైకోర్టు ఈ కీలక తీర్పునిచ్చింది. శాశ్వత నివాసంతోనూ స్థానికత మంజూరు చేయాలని కోర్టు అభిప్రాయపడింది. గత ఏడాది ఇచ్చిన హైకోర్టు ఆర్డర్స్ ఫాలో కావాలని ఆదేశించింది. కాగా, జూలై 15వ తేదీన విడుదలైన ప్రాస్పెక్టస్, నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. నోటిఫికేషన్‌లోని రూల్ 3లో 4 ఏళ్ల చదువు/నివాస నిబంధనపై అభ్యంతర వ్యక్తం చేస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. తాత్కాలిక తీర్పును ఇచ్చింది.

# యువనేత 'ముందస్తు' ప్రచారం

- వినూత్న మేనిఫెస్టోతో ప్రజల్లోకి
- ఎంపీటీసీగా ఆశీర్వదించాలని గైకోటి రాజు క్యాంపెయిన్

**వేద న్యూస్, ఇల్లందకుంట :**

స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ త్వరలో రిలీజ్ కానున్న నేపథ్యంలో ఆశావహులు ఎన్నికలకు సమాయత్తమ వుతున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ యువనేత వినూత్నంగా ముందస్తుగానే ప్రచారం చేస్తున్నారు. తనదైన ఓ మేనిఫెస్టోను రెడీ చేసుకుని ప్రజల్లోకి వెళ్తున్నారు. తనను ఎంపీటీసీగా ఆశీర్వదిస్తే చేయబోయే పనుల గురించి ఆయన వివరిస్తున్నారు. ఇల్లంద కుంట మండల పరిధిలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువనేత, యూత్ కాంగ్రెస్ ఇల్లందకుంట మండల ఉపాధ్యక్షుడు గైకోటి రాజు.. 'స్థానిక' ఎన్నికల్లో బరిలోకి దిగనున్నట్టు పేర్కొంటున్నారు. తనను కనగర్తి–శ్రీరాములపల్లి ఎంపీటీసీగా గెలిపిస్తే చేయబోయే పనులకు సంబంధించిన ఓ మేనిఫెస్టో గురించి వివరిస్తున్నారు. ప్రతి పెళ్లి జంటకు బట్టలు, రెండు గ్రామాలకు ఉచిత మినీ అంబులెన్స్ సేవలు, చనిపోయిన కుటుంబాలకు 50 కిలోల బియ్యం ఇవ్వనున్నట్టు తెలియజేస్తున్నారు. తనను ఆశీర్వదించాలని కోరుతున్నారు. కాగా, 'స్థానిక' ఎన్నికలకు నోటిఫికేషన్ రాకమునుపే ఎంపీటీసీ అభ్యర్థిగా ప్రచారం చేస్తుండటంతో ప్రజల్లో చర్చ జరుగుతోంది. యువనాయకుడు ముందుగానే ప్రచారంలోకి దిగారని పలువురు పేర్కొంటున్నారు.



# తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు

- రవీంద్రభారతిలో కన్నుల పండుగగా తెలంగాణ సన్మాన్ పురస్కారాల ప్రధానోత్సవం



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

దశాబ్ద కాలం తర్వాత నిజమైన తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు లభించడం అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు నారగౌని పురుషోత్తం నేతృత్వంలో రవీంద్రభారతిలో తెలంగాణ సన్మాన్ 2025 పురస్కార ప్రధానోత్సవ కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలం గాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలం గాణ కల్చరల్ ఫౌండేషన్ సంయుక్తా ధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయ శంకర్ స్మారక పురస్కారాన్ని బీర్ల ఐలయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భ ంగా తెలంగాణ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయ సంస్థ జాయింట్ సెక్రెటరీ శ్యాం ప్రసాద్ లాల్ సభకు అధ్యక్షత వహించారు. భాషాభివృద్ధి సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి వీరనారి చిట్యాల ఐలమ్మ స్మారక పురస్కారా న్ని అందజేశారు. వీరితో పాటు సీనియర్ ఫిలిం క్రిటిక్ పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ స్మారక పురస్కారం, ప్రముఖ గాయకులు దరువు అంజన్నకు ప్రజా యుద్ధ నౌక గద్దర్ స్మారక పురస్కారం, సీనియర్ పాత్రికేయులు కాసుల ప్రతాపరెడ్డికి తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి స్మారక పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భం గా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభిస్తోందని అన్నారు. పది సంవ త్సరాలుగా ఉద్దేశపూర్వకంగా అనగదొక్కిన కవులు, కళాకారులకు అసలైన గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. దొరల గడీలకు భజన చేసే కళాకారులకు తప్ప అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభించ లేదని అన్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నామని తెలిపా రు. కేవలం తనకు వంత పాడలేదన్న ఉద్దేశంతో కెసిఆర్ దూరం పెట్టిన వారం దరిని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి వారి అభిప్రాయాలు ఎలా ఉన్నా సరే ఉద్యమంలో వారు చేసిన పనిని గుర్తించి ప్రోత్సహిస్తు న్నారని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ స్థాపించి నాటి అసలు సిసలైన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు నిస్తూ ప్రోత్స హించే విధంగా కృషి చేయడం అభినం దనీయమని అన్నారు. ప్రొఫెసర్ జయ శంకర్ సార్ పేరిట అవార్డు ఇవ్వడంతో తన బాధ్యతను పెంచిందని, ఈరోజు నుంచి మరింత జాగ్రత్తతో తన విధులు నిర్వర్తిసా నని ఆయన అన్నారు. బీసీ కమిషన్ సభ్యురాలు, చాకలి ఐలమ్మ పురస్కార గ్రహీత రంగు బాలలక్ష్మీ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పుట్టిన గడ్డ నుంచి తాను రావడం, ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుంటూ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడడం సాధించిన రాష్ట్రంలో వివక్షతను ఎదుర్కొంటూ దశాబ్ద కాలం తర్వాత ఇటువంటి సన్మానాన్ని అందు కోవడం సంతోషకరమని అన్నారు.

పైడి జయరాజు పురస్కార అవార్డు గ్రహీత పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ దాదాసా హెబ్ అవార్డు పొందిన పైడి జయరాజును తెలుగు చలనచిత్ర రంగం పరిశ్రమ అనేక దశాబ్దాలుగా విస్మరించిందని, ప్రత్యేక తెలం గాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆయన సేవలు గుర్తించలేదని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అలా మరుగున పడి పోయిన వారికి గుర్తింపు లభిస్తోందని అన్నా రు.గద్దర్ అవార్డు గ్రహీత దరువు అంజన్న మాట్లాడుతూ తెలంగాణ కోసం నిరంతరం కొట్లాడిన పోట్లాడిన గద్దర్ అన్న స్మారక అవార్డు తనకు లభించడం తనకెంతో చిరస్మరణీయ మని తెలిపారు. పన్నెండ్లుగా గుర్తింపు లేని తమకు ఈ అవార్డు ఇవ్వడం గద్దర్ అన్నను స్మరించుకోనే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకర మని అన్నారు. తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతా పరెడ్డి స్మారక అవార్డు గ్రహీత కాసుల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఆ మహనీయుని పేరిట తనకు అవార్డు ఇవ్వడం తెలంగాణ ఉద్యమంలో తనను గుర్తించడం ఎంతో బాధ్యత పెంచిందని అన్నారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కాలేరు సురేష్, ప్రాగ్నిక అధినేత కే ప్రవీణ్ కుమార్, మార్గం రాజేష్, రాగిరి సత్యనారాయణ గౌగాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సీనియర్ నాయకురాలు మెరుగు సునీత తదితరులు పాల్గొన్నారు.



## గ్రీవెన్స్ డేలో 25 ఫిర్యాదులు..!

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే ఐపీఎస్. తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 25 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

### ప్రతి ఒక్కరూ బాధ్యతగా
## మొక్కలను నాటి సంరక్షించాలి




**వేద న్యూస్, చొప్పదండి :**

నెహ్రూ యువ కేంద్ర, నవతరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో “ఏక్ పెడ్ మా కె నామ్” కార్యక్రమంలో భాగంగా చొప్పదండి మండల్ రుక్మాపూర్ మోడల్ స్కూల్ లో మొక్కలు నాటారు. అనంతరం విదార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. నవతరం యూత్ అధ్యక్షుడు జాగీరి సాయి గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడడం కోసం బాధ్యతగా చెట్లు నాటి వాటిని సంరక్షించాలని అప్పుడే మంచి వాతావరణం (కాలుష్యం లేనటువంటి) ఏర్పడానికి దోహదపడుతుందని సూచించారు. మొక్కలు నాటడంతో మనిషి జీవనానికి ఎంతో తోడ్పడుతుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా అనూష్, వడ్లకొండ ఆకాష్, జేశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామశాఖ అధ్యక్షులుగా నర్రా రాజు

**వేద న్యూస్,శాయంపేట:**



శాయంపేట మండలంలోని గోవిందపూర్ బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులుగా నర్ర రాజు ను ఏక గ్రీవంగా ఎన్ని కయ్యారు. గతంలో ఎన్నికైన దాసి శ్రవణ్ సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమితులు కావడంతో నర్రా రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఎన్నికకు సహకరించిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర వెంకట రమణారెడ్డి, భూపాలపల్లి అధ్యక్షురాలు జ్యోతి, పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, కొప్పుల గ్రామ శాఖ అధ్యక్షులు మేకల వెంకన్న, నాయకులు గజ్జెల రాజు, ఆకుల లక్ష్మణ్, అమ్మ అశోక్, కొమ్ముల శివ, ఆకుతోట రవి, చింత నిప్పుల భద్రయ్య పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్ వ్యాపారుల ధర్నా



**వేద న్యూస్, కాజీపేట :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం మున్సిపల్ కార్యాలయాన్ని సోమవారంబిజెపి పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులచే కాజీపేట మున్సిపల్ కార్పొరేషన్ ను ముట్టడించి ధర్నా చేశారు. రహదారులపై కూరగాయలను అమ్ముతున్న దుకాణాలను తొలగిస్తానని కమిషనర్ 15 రోజుల క్రితం మాట ఇవ్వడం జరిగిందని , ఇప్పటివరకు మున్సిపల్ అధికారులు, కమిషనర్ ఇలాంటి చర్య తీసుకోలేదని, వ్యాపారస్తులు ఆగ్రహించి ముట్టడించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ అధ్యక్షులు బిక్షపతి, ఏసు, విజయ్ ,చిన్న, సాంబన్న, నాగరాజు, అనిల్, చాంద్బాషా, నర్సింగ్ గౌడ్, భగవాన్ ఉపాధ్యాయ ,కొమరమ్మ, కళా లక్ష్మి, భూలక్ష్మి, రాజేశ్వరి, వెంకటమ్మ ,జయమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



### పర్యావరణ పరిరక్షణలో
## చెట్లను నాటిన విద్యార్థులు

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంత పల్లి స్కూలులో విద్యార్థులచే చెట్లను నాటే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులందరు తమ వంతుగా ఒక్కొక్కరు ఒక్క చెట్టు ను నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ముందు తరాల భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకొని రాబోయే రోజుల్లో మంచి వాతావరణాన్ని అందించేందుకు విద్యార్థులతో చెట్లను నటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల కాంగ్రెస్ కార్యదర్శి అలువాల ధర్మయ్య, నేరెళ్ల మునీందర్ గౌడ్, స్కూల్ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

### ఆగిన ఇందిరమ్మ
## ఇంటి నిర్మాణం..!




**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం బండలింగపూర్ గ్రామానికి చెందిన అల్గొట్ లక్ష్మి అనే మహిళ తన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ఆగిపోయిందంటూ జగిత్యాల జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నానని ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకంలో ఇల్లు రావడంతో నాకున్న పాత స్థలం ఇంటి నెంబర్ 7-48 లో ఇంటి నిర్మాణం చేపడుతుండగా ఇదే గ్రామానికి చెందిన రెడ్డవేణి మహేష్ అనే వ్యక్తి అక్రమంగా భూమి నాదంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని అనేకమార్లు పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడినప్పటికీ తన ధోరణి మార్చుకోవడం లేదని అన్నారు. మహేష్ అక్రమంగా రెండంతస్తుల ఇంటి నిర్మాణం చేపట్టాడని దానికి ఎటువంటి పర్మిషన్లు తీసుకోలేదని గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు అక్రమ నిర్మాణం తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు లక్ష్మి తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెరగాలని,ప్రతి మండలంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండ్ అయ్యే విధంగా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష నిర్వహించారు.జిల్లాలో మండలాల వారిగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు, మార్కింగ్ చేసిన ఇండ్లు, నిర్మాణం జరుగుతున్న ఇండ్లు, వాటి పురోగతి వివరాలను మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ,సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వం 8 వేల 811 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 5011 ఇండ్ల మార్కింగ్ జరిగిందని, 1485 ఇండ్లు బేస్మెంట్ స్థాయికి, 122 గోడల దశ వరకు, 50 ఇండ్లు రూఫ్ వరకు నిర్మాణం జరిగాయని తెలిపారు. శ్రావణ మాసంలో పెండింగ్ ఇండ్ల మార్కింగ్ పనులు కూడా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలు నియంత్రణలో ఉండేలా మండల స్థాయి కమిటీ పని చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన యాప్ లో సర్వే వివరాల నమోదు రెండు రోజులలో పూర్తి చేయాలని ప్రతి మండలంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభమయ్యే విధంగా అధికారులు లబ్ధిదారులతో చర్చలు జరపాలని కలెక్టర్ తెలిపారు. నగదు సమస్య ఉన్న లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించేందుకు కార్యచరణ చేపట్టాలనిఅన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు క్యాప్చర్ చేస్తూ ఆన్ లైన్ లో నమోదు చేయాలని,లబ్ధిదారులకు ప్రభుత్వ తరఫు నుంచి ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు చూడాలని, మన దగ్గర పెండింగ్ ఉండకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు.ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుందని, ఇసుక తీసుకెళ్ళేందుకు కూలీ, రవాణా చార్జీలు మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని, జిల్లాలో ఎక్కడైనా 1500 కంటే ఎక్కువ ట్రాక్టర్ ఇసుక సరఫరా కోసం వసూలు చేస్తే అధికారుల దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోనే కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, మోడల్ స్కూల్స్ లను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యా సంస్థల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉన్నాయా, నీరు నిల్వ ఉంటుందా,విద్యార్థులకు అందించే ఆహార, త్రాగునీటి నాణ్యత, ఎలా ఉంది వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు.ఈ సమావేశంలో పిడి హౌసింగ్ శంకర్ రెడ్డి మండల ప్రత్యేక అధికారులు తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నోటు బుక్స్, బ్యాగుల పంపిణీ

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలోని గొల్లపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మాజీ కో ఆప్షన్ సభ్యులు వైనాల రాజేందర్ ఉచితంగా నోటు పుస్తకాలు, బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్య అధికారి గడ్డం బిక్షపతి,మాజీ జెడ్పిటిసి వంగాల నారాయణరెడ్డి పాల్గొని విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం వంగాల నారాయణ రెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా మూసి ఉంటున్న ప్రభుత్వ పాఠశాలలకు పునర్జీవం వచ్చింది. ప్రభుత్వ పాఠశాలను పునర్ ప్రారంభించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో 15 మంది విద్యార్థులను చేర్పించిన ఏం ఎస్ పి మండల అధ్యక్షులు మామిడి భాస్కర్ ని అభినందించారు.పాఠశాలను పునర్ ప్రారంభించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎంఈఓ ని ఇక్కడ విద్యార్థులకు బోధనా అందించడంలో తమ వంతు సహాయాన్ని అందిస్తున్న ప్రధానోపాధ్యాయులు అశోక్ ను వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతర విద్య అధికారి గడ్డం బిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నం దున విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు, అన్ని మౌలిక వసతులు ఉంటాయన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్ బంగారంలా ఉండాలంటే ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు ,బ్యాగులు, ప్లేట్లు, గ్లాసులు, షూస్ విద్యార్థుల నిత్యవసర వస్తువులను ఉచితంగ అందజేసిన వైనాల రాజేందర్‌ని వారు ఘనంగా సత్కరించారు. చక్కటి కార్యక్రమాలతో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్న విద్యార్థులు తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోట కుమారస్వామి, విద్య కమిటీ చైర్మన్ మామిడి ప్రియా, మాజీ వార్డ్ నెంబర్ తోకల సమ్మిరెడ్డి, కుమ్మరి రాజయ్య, కుమ్మరి జగన్, సాయిరాం, గుండారపు రవీందర్, విద్యార్థుల తల్లిదండ్రులు అంగన్వాడి ఉపాధ్యాయులు, ఆయాలు పాల్గొన్నారు.



పేకాట స్థావరంపై ఎస్సై మోతిరామ్ దాడి

వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులో గల గుడిసె వద్ద పేకాట ఆడుతున్న సమాచారం మేరకు పోలీసులు సోమవారం దాడికి దిగారు. ఎస్సై ఎం. మోతిరామ్ నేతృత్వంలోని పోలీస్ బృందం రైడ్ చేసి, పేకాటలో పాల్గొన్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని.వారి వద్ద నుండి 08 మొబైల్ఫ్లు, 6 బైకులు, ప్లేయింగ్ కార్డ్స్, నగదు రూ. 4, 630స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మండల వ్యాప్తంగా పేకాట స్థావరాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్సై మోతిరామ్ తెలిపారు.

# కార్పొరేట్ కబంధహస్తాలలో చిక్కుకున్న చదువు



- ఆర్.నారాయణమూర్తి

**వేదన్యూస్, హనుమకొండ :**

విద్య వ్యాపారంగా మారిందని కార్పొరేట్ కబంధహస్తాలలో చదువు చిక్కుకున్నది, చదువుకునే రోజుల నుంచి చదువు కొనుక్కునే పరిస్థితులను వివరిస్తూ వర్సిటీ పేపర్ లీకేజ్ ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్నేహ చిత్ర పిక్చర్స్??లో తెరకెక్కిన సినిమా 'యూనివర్సిటీ పేపర్ లీకేజ్-ఏ ఫిలిం బై ఆర్ నారాయణమూర్తి' ఆగస్టు 22న విడుదలవుతుందని, సినిమాని వీక్షించి అందరూ ఆదరించాలని దర్శక నిర్మాత, నటుడు పీపుల్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి అన్నారు. సోమవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో 'యూనివర్సిటీ పేపర్ లీకేజ్' సినిమా పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ సామాజిక అసమనతులపై, విద్య, వైద్యం, క్లాసిఫికేషన్, క్యాస్టిఫికేషన్ అంశాలపై తన జీవితాన్ని సినిమా రంగానికి అంకితం చేసి పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, సినిమా రూపంలో ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ వెండితెరపై దశాబ్దాలుగా మన జీవితాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్టు చూపిస్తూ ప్రస్తుతం కార్పొరేట్ కబంధహస్తాలలో చిక్కుకున్న చదువు, ఈరోజుల్లో ఎక్కడ చూసినా పేపర్ లీకేజ్ అనేది సర్వసాధారణంగా మారిందని, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల పేపర్ లీక్ కావడం ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ విద్యార్థుల పరీక్ష పత్రాలు లీక్ అంటే ఈ సమాజాన్ని నాశనం చేయడమేనన్నారు. కార్పొరేట్ కబంధహస్తాలలో విద్య ఇరుక్కుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సేవా రంగంగా ఉండాల్సిన విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపార రంగంగా మార్చారని, తన సినిమాని ప్రజలు, కవులు, కళాకారులు, మేధావులు, నిరుద్యోగులు విద్యార్థులు అధిక సంఖ్యలో చూసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిసంఘాల నాయకులుసంతోష్, రంజిత్‌కుమార్, సాయి, వేల్పుల చరణ్, కసరబోయిన రవితేజ, సిపతి వినయ్, వంశీకృష్ణ, విజయ్, కళ్యాణ్, వినయ్, హర్షద్ పాల్గొన్నారు.

# 272 సర్వే నంబర్‌లో రిజిస్ట్రేషన్లన్నీ క్యాన్సిల్ చేయాలి

- బాధ్యులైన సబ్ రిజిస్ట్రార్లందరిపై చర్య తీసుకోవాలి
- జిల్లాలోని ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరపించాలి
- సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**వేదన్యూస్, కరీంనగర్ :**



కరీంనగర్ జిల్లా కొత్తపల్లి హవేలి రెవెన్యూ పరిధిలోని 272 సర్వే నంబర్ లో ఉన్న 24.24 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, ఇందులో చట్ట విరుద్ధంగా చేసిన అన్ని రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కొత్తపల్లిలోని మెడికల్ కాలేజీ ఎదురుగా అత్యంత విలువైన ఈ భూములను ప్రభుత్వం కాపాడాలన్నారు. ఈ సర్వే నంబర్ ను పూర్తిగా ప్రొహిబిటెడ్ లిస్టులో చేర్చినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా గత పాతికేళ్లుగా సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ చేస్తూ వస్తున్నారని, ప్రభుత్వ, అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్లందరిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్- జగిత్యాల జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ భూమి విలువ రూ.200 కోట్లకుపైగా ఉంటుందని, ఈ భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ఇలా ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ జాబితాలోని సర్వే నంబర్లలోని భూముల రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సర్వే నంబర్ లో కేవలం 9 డాక్యుమెంట్లను మాత్రమే రద్దు చేయడం సరికాదని, ఆ సర్వే నంబర్‌లో అయిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లన్నింటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో కొందరు పేరు, పలుకుబడి ఉన్నవాళ్లను ఆఫీసర్లు కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సబ్ రిజిస్ట్రార్ ను సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకుంటే సరిపోదని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నిబంధనలు ప్రకారం కోడిగుడ్ల సరఫరా టెండర్ల నమోదు చేయాలి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అంగన్వాడి కేంద్రాలు రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు అవసరమైన కోడిగుడ్ల సరఫరా చేసేందుకు నిబంధనలు ప్రకారం టెండర్ దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కోడి గుడ్ల ప్రోక్యూర్ మెంట్ పై నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పాల్గొన్నారు.ఒక సంవత్సరం పాటు కోడిగుడ్ల సరఫరా టెండర్ ప్రక్రియ పై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ,జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు ( ఎస్సి,ఎస్టీ, బీసి, మైనారిటీ కేజీబీవీ)మధ్యాహ్న భోజన పథకం మినహాయించి ఒక సంవత్సరం పాటు అవసరమైన కోడి గుడ్లు ప్రమాణాల ప్రకారం సరఫరా చేసేందుకు టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

కోడిగుడ్ల సరఫరా టెండర్‌ను దాఖలు చేయాలంటే తెలంగాణ లోని కోళ్ల ఫారం గల పౌల్ట్రీ రైతులు గత 3 సంవత్సరాల ఓనర్ షిప్ (2022-25) చూపించే టెండర్లలో పాల్గొనే అవకాశం ఉంటుందని, లీజ్ కోళ్ల ఫారంకు అర్హత లేదని, ఆగ్ మార్క్ సర్టిఫికేషన్ ఉండాలని, ఒక కోళ్ల ఫారం 8 జిల్లాల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, టెండర్ డాక్యుమెంట్ లో ఉన్న గుడ్లలో కనీసం 40 శాతం వరకు సొంతంగా కోళ్ల ఫారం నుంచి ఉత్పత్తి చేయాలని మిగిలినవి పౌల్ట్రీ రైతుల నుంచి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సర్టిఫికేషన్ తో టై అప్ చేసుకోవచ్చని అన్నారు.టెండర్ దాఖలు చేసే పౌల్ట్రీ రైతులకు గత మూడు సంవత్సరాలలో ఒక సంవత్సరంలో ఐదు కోట్ల రూపాయల విలువగల గుడ్లు సరఫరా చేసిన అనుభవం ఉండాలని, వార్షిక టర్న్ ఓవర్ 4 కోట్ల పైగా ఉండాలని, అవసరమైన లైసెన్సులు ఉండాలని అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సంవత్సరం పాటు అవసర మైన కోటి 34 లక్షల 6 వేల 730 కోడిగుడ్లు సుమారుగా అవసరం ఉన్నాయని, ప్రతి కోడి గుడ్డుకు 7 రూపాయల చొప్పున నెక్ (ఎన్ ఈ సి సి) రేట్స్ ప్రకారం ప్రభుత్వం చెల్లింపు చేస్తుందని, వీటీ పంపిణీకి ఆసక్తి, అర్హత గల వారు నాన్ రిఫండబుల్ డీడీ 10 వేల రూపాయలు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రాజన్న సిరిసిల్ల పేరు మీద డిడి తీసి టెండర్ దాఖలు చేయాలని, టెండర్ దక్కిన వారు 1% ఈ.ఎం.డీ క్రింద 9 లక్షల 38 వేల 471 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.కోడిగుడ్ల సరఫరా టెండర్ బిడ్ డాక్యుమెంట్ జూలై 29 లోపు డౌన్ లోడ్ చేసుకోని ఆగస్టు 7,2025 సాయంత్రం 4 గంటల లోపు ఆన్ లైన్‌లో, ఆగస్టు 8,2205 సాయంత్రం 4 గంటల లోపు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నందు టెండర్ డాక్యుమెంట్లు హార్డ్ కాపీలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఆగస్టు 12న టెక్నికల్ బెడ్, 13న ఫైనల్ బెడ్ ఓపెనింగ్ ఉంటుందని పేర్కొన్నారు.టెండర్లను ఆన్ లైన్ లో ఈ టెండరింగ్ ప్లాట్ ఫామ్ లో మాత్రమే నమోదు చేయాలని, ఆఫ్ లైన్ విధానంలో అనుమతించడం లేదని అన్నారు. టెండర్ దాఖలు సమయంలో తప్పుడు సమాచారం అందిస్తే సదరు టెండర్ ను ఏ క్షణంలోనైనా రద్దు చేయడమే కాకుండా బిడ్డను బ్లాక్ లిస్ట్ చేయడం జరుగుతుందని, క్రిమినల్ ప్రాసీక్యూషన్ కూడా చేస్తామని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా పశు సం వర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం,ఆయా విద్యాల యాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వసనీయతతో కూడిన విశ్లేషణాత్మక వార్తలను రాయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**





పాత్రికేయులు విశ్వసనీయతతో కూడిన విశ్లేషణాత్మక వార్తలను రాయాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని కరీమాబాద్ లో గల తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో వరంగల్ జిల్లా ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రెండు రోజులపాటు నిర్వహించిన వృత్తి నైపుణ్యత శిక్షణ ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ నిజనిర్ధారణ జర్నలిజంలో ఒక ముఖ్యమైన భాగమనీ, జర్నలిస్టులు కచ్చితంగా నిజాలను నిర్ధారించుకున్న తర్వాతే నిర్భయంగా వార్తలు రాయాలన్నారు. జర్నలిస్టులు వార్తల గురించి సమగ్ర పరిశోధన చేసి మూలాలను తనిఖీ చేసి, సమాచారం యొక్క ఖచ్చితత్వాన్ని నిర్ధారించి తదుపరి వార్తలు రాయాలన్నారు. జర్నలిస్టులు వృత్తిపరమైన నియమాలను పాటించాలన్నారు. ఖచ్చితమైన నమ్మదగిన సమాచారం అందించడం ద్వారా జర్నలిస్టు సమాజానికి సేవ చేసిన వారు అవుతారు అన్నారు. నైతిక విలువలు పారదర్శకత కలిగిన వార్తలు రాసినప్పుడే జర్నలిస్టులపై ప్రజలకు గౌరవం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగంలో వార్తల సేకరణ సులభమవుతుందన్నారు. భవిష్యత్తులో పత్రికల నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించనుందన్నారు. జెడ్పి సీఈఓ రామిరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు పక్షపాతం లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తూ వార్తలు సేకరించాలన్నారు. జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండాలని తెలిపారు. ప్రస్తుత సమాజంలో వార్త వైరల్‌గా మారుతోందని, సామాజిక మాధ్యమాల్లో ఒకే అంశాన్ని పదే పదే ప్రచారం చేస్తూ అబద్ధాన్ని నిజం చేసేందుకు పోటీ పడుతున్నారని, ఈ నేపథ్యంలో పాత్రికేయులు సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డేటా జర్నలిజం గురించి తెలుసుకోవాలన్నారు. రెండో రోజు జరిగిన శిక్షణ తరగతుల్లో తోట భావనారాయణ గ్రామీణ వార్తలు, ఎలక్ట్రానిక్ మీడియాపై వివరించారు. పరిశోధనాత్మక కథనాల చీఫ్ ఎడిటర్ ఉడుముల సుధాకర్ రెడ్డి పరిశోదాత్మక కథనాలు, నేర వార్తలు, ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్ తదితర అంశాల గురించి కూలంకశంగా వివరించగా, దిశ దినపత్రిక చీఫ్ ఎడిటర్ మార్కండేయ వార్త కథనాలు, ప్రత్యేక కథనాలను రాసే సమయంలో పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాల గురించి వివరంగా తెలిపారు. అనంతరం శిక్షణ తరగతులకు హాజరైన పాత్రికేయులకు ముఖ్య అతిధులు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేష్ రెడ్డి, డబ్ల్యూజేఐజేయు అధ్యక్షులు శ్రీరామ్ రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, డిపిఆర్ఓ అయూబ్ అలీ, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ డాక్టర్ వరుణ్, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు

# ధన్యవాదాలు

- ఎల్కతుర్తి ఏఎంసీ ఏర్పాటు చేసినందుకు..
- టీఆర్ఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

హుజూరాబాద్ మార్కెట్ కమిటీని విభజిస్తూ ఎల్కతుర్తిని ప్రత్యేక వ్యవసాయ మార్కెట్‌గా(ఏఎంసీ)గా గుర్తింపు వచ్చేలా కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలంగాణ రైతు రక్షణ సమితి (టీఆర్ఆర్ఎస్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన రిలీజ్ చేశారు. ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీకి స్వయం ప్రతిపత్తి నెలకొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు వల్ల మండల పరిధిలోని 19 గ్రామాల రైతులకు లబ్ధి చేకూరనుందని అభిప్రాయపడ్డారు.

# బీసీల ఓట్ల కోసమే బీజేపీ, కాంగ్రెస్ డ్రామా

**వేదన్యూస్, హైదరాబాద్ :**





దేశం మొత్తం ఓబీసీ వర్గాల వెనకబాటు తనంపై చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా కులగణనకు ఒప్పుకుంది. చట్ట సభల్లో కూడా బీసీలకు రిజర్వేషన్లు వస్తాయనే వాతావరణం ఏర్పడింది. చట్టసభల్లో రిజర్వేషన్లు దేవుడెరుగు ఇపుడు రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావడం గగనమవుతోంది. గవర్నర్ దగ్గర ఆర్డినెన్స్ కు మోక్షం లభించలేదు. ఢిల్లీలో రాష్ట్రపతి దగ్గర బుక్ బిల్లులు ఏమయ్యాయో తెలియదు అని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఈ రోజు కేబినెట్ సమావేశం ఉంది ఏం తెలుస్తారు? బీసీల పట్ల కాంగ్రెస్, బీజేపీలది వగల ప్రేమే అని తేలిపోయింది. బీసీ ఓట్ల కోసమే ఆ రెండు పార్టీలు డ్రామా ఆడుతున్నాయి. తొమ్మిదో షెడ్యూల్లో పెడితే తప్ప బీసీలకు రిజర్వేషన్లు పెరుగవు. బీజేపీ ముస్లిం రిజర్వేషన్లను సాకుగా చూపి బీసీ రిజర్వేషన్ల పెంపును అడ్డుకుంటోంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం లేదా ? ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో ముస్లింలు లేరా ? రిజర్వేషన్లు రాష్ట్రం పరిధిలో లేని అంశమనీ..

ఎవరైనా ఇక్కడ పెంచితే జైలుకు వెళ్లడం ఖాయమని రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం కాదని తెలిసి రేవంత్ రెడ్డి రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్‌ను గవర్నర్ దగ్గరకు ఎందుకు పంపారు? బీసీ బిల్లుల ఆమోదానికి కేంద్రం దగ్గర రేవంత్ రెడ్డి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. బీసీల మీద సీఎంది కపట ప్రేమ అని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు.కాంగ్రెస్ బీసీ నాయకులు 42 శాతం రిజర్వేషన్ల పెంపు కోసం గట్టిగా కృషి చేయాలి. బీసీలకు ఏదీ చేయాలన్నా బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు.

సీఎం, మంత్రులు బీసీ బిల్లులు ఆమోదించుకోవడానికి ఢిల్లీ వెళ్లి పాస్ అయ్యాకే హైదరాబాద్ తిరిగి రావాలి. కాంగ్రెస్, బీజేపీల చేతిలో మరోసారి మోసపోవడానికి బీసీలు సిద్ధంగా లేర. ఆర్డినెన్స్ గవర్నర్ దగ్గరకు పంపగానే కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకున్నారు .ఇపుడు ఏం సమాధానం చెబుతారు. బీసీలకు విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పెంపు కోసం ఎందుకు ఆర్డినెన్స్ తేలేదు..? ఢిల్లీకి అఖిలపక్షం తీసుకెళితే మేము వస్తాం. ఆ పని చేయడం లేదు అని శ్రీనివాస్ గౌడ్ దుయ్యబట్టారు.

వేద న్యూస్

మంగళవారం జులై 29, 2025

# ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన ఫార్మా బాధిత రైతులు..

**వేదన్యూస్, యాచారం:**

ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఇంటిని ఫార్మా బాధిత రైతులు సోమవారం ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ముట్టడించారు. యాచారం మండలంలోని మేటి పల్లి నానక్ నగర్ తాటిపర్తి కురుమిద్ద గ్రామాలకు చెందిన ఫార్మా బాధిత రైతులు ఉదయం తెల్లవారుజామునే క్రుయిజర్లు, ట్రాక్టర్లు కట్టుకొని తిరుమలహిల్స్‌లోని ఎమ్మెల్యే రంగారెడ్డి ఇంటికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. రంగారెడ్డి ఇంటి ముందు సుమారు 300 మంది రైతులు, మహిళలు, యువకులు బైఠాయించి ప్లకార్డులను ప్రదర్శించి నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యే రంగారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చే వరకు అక్కడి నుంచి కదిలేది లేదంటూ రైతులు భీష్మించి కూర్చున్నారు.ఃఈ సందర్భంగా ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త కవుల సరస్వతి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఫార్మా బాధిత రైతులకు ఎమ్మెల్యే రంగారెడ్డి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని ఫార్మా బాధిత రైతులకు భూములను తిరిగి ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న నేటికీ హామీ నెరవేర్చక పోవడం ఎంతవరకు సమంజసం అని ఆమె ప్రశ్నించారు. ఫార్మా సిటీపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఫార్మాకు ఇవ్వని 2500 ఎకరాల భూమిని తిరిగి రైతుల పేరిట ఆన్లైన్లో నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నిషేధిత జాబితా నుండి ఇట్టి భూములను వెంటనే తొలగించాలని కోరారు. రైతులకు రైతు భరోసా, రైతు భీమా, పంట రుణం, రుణమాఫీ, రైతులు భూమిని అమ్ముకునేందుకు వీలుగా రిజిస్ట్రేషన్ అయ్యేలా వసతి కల్పించాలని ఆమె కోరారు.కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు రైతులతో కలిసి పాదయాత్ర చేసిన మంత్రులు సీతక్క భట్టి విక్రమార్క కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఎమ్మెల్సీలు కోదండరాం తీన్మార్ మల్లన్న ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిలు నేడు పార్టీ అధికారంలోకి వచ్చి వారికి పదవులు రాగానే ఫార్మా రైతులను పూర్తిగా విస్మరించాలని ఆమె మండిపడ్డారు.

ఇకపై రైతులతో పాదయాత్ర చేసి రైతులను విస్మరించిన ప్రతి నాయకుడిని ఇంటిని ముట్టడించి నిలదీస్తామని ఆమె స్పష్టం చేశారు. అయినప్పటికీ రైతులకు న్యాయం జరగ కపోతే ఇక ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కానమోని గణేష్, సామ నిరంజన్, కుందారపు నారాయణ, పాపి రెడ్డి, చెన్నయ్య, సందీప్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీకాంత్, రాజశేఖర్ రెడ్డి, రైతులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







### పండ్ల ట్రేలలో 935 కిలోల
# గంజాయి పట్టివేత

**హైదరాబాద్, వేదన్యూస్ :**

రంగారెడ్డి జిల్లా బాటసింగారం వద్ద భారీగా గంజాయి పట్టుబడింది. పండ్ల ట్రేలలో పెట్టి డీసీఎంలో తరలిస్తుండగా ఖమ్మం ఈగల్ పోలీసులు, రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 935 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా బాటసింగారం పండ్ల మార్కెట్ సమీపంలో పట్టుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. 35 సంచుల్లో 455 గంజాయి ప్యాకెట్లను పండ్ల ట్రేలలో పెట్టి డీసీఎంలో తరలిస్తున్నారని, దీని విలువ రూ.5 కోట్లు ఉంటుందని చెప్పారు. మహారాష్ట్రకు చెందిన పవార్ కుమార్ అనే కీలక నిందితుడిని అరెస్టు చేశామని, విక్కీ సేత్ అనే వ్యక్తి ద్వారా గంజాయిని ఒడిశా నుంచి తరలిస్తున్నారని వెల్లడించారు. డీసీఎంకు ఎస్కార్ట్‌గా ఇన్నోవా కారు వెళుతున్నట్టు గుర్తించామన్నారు. కారు, డీసీఎంను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేశామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు.



### 'మాల్దీవుల అధ్యక్షుడిని కౌగిలించుకునే
# ముందు మతం అడిగారా?

**కోల్‌కతా, వేదన్యూస్ :**

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రధాని మోదీపై మండిపడ్డారు. మాల్దీవుల అధ్యక్షుడిని కౌగిలించుకునే ముందు ఆయన మతం ఏమిటని మీరు అడిగారా? అని ప్రశ్నించారు. మాల్దీవులకు రూ.4,850 కోట్ల ప్యాకేజీని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం బెంగాల్‌కు నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. సోమవారం బిర్భూమ్ జిల్లాలోని బోల్పూర్‌లో చేపట్టిన భాషా ఉద్యమాన్ని మమతా బెనర్జీ ప్రారంభించారు. తన జీవితాన్ని వదులుకుంటాను కానీ తన భాషను ఎవరూ లాక్కోనివ్వబోనని అన్నారు. కాగా, ఈ సందర్భంగా ప్రధాని మోదీపై మమతా బెనర్జీ మండిపడ్డారు. 'మీరు అరబ్ దేశాలకు వెళ్లి షేక్‌లను కౌగిలించుకున్నప్పుడు, వారు హిందువులా లేదా ముస్లింలా అని అడుగుతారా?' అని ప్రశ్నించారు. మోదీ మాల్దీవుల పర్యటనను కూడా ఆమె తీవ్రంగా విమర్శించారు. 'బెంగాల్‌కు రావాల్సిన బకాయిలు ఇవ్వని మీరు, మాల్దీవుల అధ్యక్షుడ్ని కౌగిలించుకుని 5,000 కోట్లు విరాళంగా ఇచ్చినప్పుడు ఆయన మతం ఏమిటని మీరు అడిగారా?' అని దుయ్యబట్టారు. మరోవైపు భాష ఆధారంగా విభజనను తాను కోరుకోవడం లేదని మమతా బెనర్జీ తెలిపారు. బెంగాలీ వలసదారులపై దాడులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఎన్ఆర్సీ, నిర్బంధ శిబిరాలను బెంగాల్‌లో అనుమతించబోనని స్పష్టం చేశారు.

# మోడీ, ట్రంప్ మధ్య ఫోన్ కాల్ అబద్ధం..



**వేదన్యూస్, న్యూఢిల్లీ :**

పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో లోక్ సభ సమావేశాలు వాడీవేడీగా సాగుతున్నాయి. 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు ప్రతిపక్షం పట్టుపట్టడంతో దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం పక్కా సమాచారంతో వివరణ ఇస్తోంది. విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ ఇదే అంశంపై సోమవారం సభలో చర్చ సందర్భంగా మాట్లాడుతూ.. కాల్పుల విరమణలో అమెరికా జోక్యం లేదని తేల్చి చెప్పారు. అంతేకాదు మీడియాలో వచ్చినట్టు ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ అంతా ఉట్టిదేనని ఆయన స్పష్టం చేశారు.ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణ అంశాలపై విపక్షాలకు వివరణ ఇస్తూ జైశంకర్ పలు అంశాల్ని ప్రస్తావించారు. భారత సైన్యం దాడుల్ని తట్టుకోలేక దాయాది దేశమే కాళ్ల బేరానికి వచ్చిందని జైశంకర్ పేర్కొన్నారు. 'ప్రధాని మోడీ, ట్రంప్‌ల మధ్య ఏప్రిల్ 22 నుంచి జూన్ 17 వరకూ ఎలాంటి ఫోన్ కాల్ సంభాషణ జరగలేదు. అయితే.. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కాల్ చేసి మోడీతో మాట్లాడారు. పాకిస్థాన్ భారీ దాడికి పాల్పడనుందని ఆయన చెప్పగా.. ఒకవేళ అదే జరిగితే మేము అంతకంటే భారీ దాడులతో బదులిస్తామని మోడీ అన్నారు. మే 9, 10వ తేదీన పాక్ సైన్యం క్షిపణిదాడులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది' అని జైశంకర్ తెలిపారు.అంతేకాదు కాల్పుల విరమణకు పాక్ సిద్ధంగా ఉందని పలు దేశాలు తమకు సమాచారం అందించాయని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. అయితే.. మంత్రి వ్యాఖ్యలపై విపక్షాలు నిరసన వ్యక్తం చేయగా.. హోమ్ మినిస్టర్ అమిత్ షా కలగజేసుకున్నారు. ప్రతిపక్షాలు మనదేశ విదేశాంగ శాఖ మంత్రినే శంకిస్తున్నాయని.. వాళ్లకు ఇతర దేశాలపై మాత్రం నమ్మకం ఉందని గట్టి కౌంటర్ ఇచ్చారు షా. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. స్వదేశీ క్షిపణులతో పాకిస్తాన్‌లోని పలు ఉగ్ర స్థావరాలను రెప్పపాటులోనే నేలమట్టం చేసింది.

# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం..!

**వేదన్యూస్, హైదరాబాద్ :**



ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం అంటూ.. మేజర్ పంచాయతీల వరకే పరిమితమైన మద్యం దుకాణాలను పల్లెలకు విస్తరించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన హస్తం పార్టీ, అధికారం దక్కించుకున్న తర్వాత ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్నదని ధ్వజమెత్తారు. నాగు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని విమర్శించారు. మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు కుట్ర పన్నుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.'నాడు కేసీఆర్ పాలనలో పల్లె, పల్లెకు ప్రగతి రథచక్రాలు. ప్రతి చేనుకు నీళ్లు.. ప్రతి చేతికి పని. ఇంటింటికి తాగునీళ్లు.. ఆడబిడ్డలకు తప్పిన ఇబ్బందులు. నాడు ప్రగతిబాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని నిందలు. నేడు పల్లె, పల్లెలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర. అన్ని రంగాలలో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి .. ఇప్పుడు తీరిగ్గా ఆదాయం కోసం మద్యం అమ్మకాలను నమ్ముకున్న అసమర్థ కాంగ్రెస్ సర్కార్.ఏడాది క్రితం సగటున ఒక వ్యక్తి మద్యం కోసం చేసే ఖర్చు రూ.897. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సగటున ఒక వ్యక్తి మద్యం మీద చేస్తున్న ఖర్చు రూ.1623కు పెరిగింది. లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచి, ధరఖాస్తు ధర రూ.3 లక్షలకు పెంచాలని నిర్ణయం. నాడు మద్యం అమ్మకాలపై విమర్శలు, నేడు అధికారం దక్కించుకుని ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్న కాంగ్రెస్ సర్కార్. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం. పాలన గాలికి.. ప్రగతి కాటికి' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు

# బనకచర్లపై కేంద్రం కీలక ప్రకటన

**వేదన్యూస్, న్యూఢిల్లీ :**



బనకచర్ల ప్రాజక్ట్ పనులు ఇంకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్ట లేదని కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును ఇప్పటికే కేంద్ర జలసంఘానికి అందించినట్లు తెలిపారు. ఈ ప్రాజక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ... లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ ప్రాజక్ట్ సాంకేతిక – ఆర్థిక అంచనాల కోసం కేంద్రం తగిన ప్రక్రియను అనుసరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌పై సంబంధిత అధికారులు, పరీవాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర జల శక్తి మంత్రి రాజ్ భూషణ్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే గోదావరి మిగులు జలాలను రాయలసీమకు తరలించి.. సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆ క్రమంలో గోదావరిపై బనకచర్ల ప్రాజెక్ట్‌ను రూ. 81,900 కోట్లతో నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ క్రమంలో అఖిల పక్షం ఏర్పాటు చేసి.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని పలువురు మంత్రులు ఢిల్లీలోని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి.. బనకచర్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలని.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు భవిష్యత్తులో కలిగే సమస్యలను వివరించింది. దీంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సమర్పించిన దస్త్రాన్ని కేంద్రం జలశక్తి మంత్రిత్వ శాఖ పక్కన పెట్టింది.ఆ తర్వాత.. ఇటీవల న్యూఢిల్లీ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలు ఈ సందర్భంగా వీరు చర్చించారు. అనంతరం ఈ అంశంపై నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలంటూ ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి ఇరు రాష్ట్రాల భారీ నీటి పారుదల శాఖ మంత్రులతోపాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కేసీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్

**వేదన్యూస్, హైదరాబాద్:**



గిరిజన సంక్షేమం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందని ధ్వజమెత్తారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు రోడ్లు, బ్రిడ్జిలు అవసరమని.. కానీ గతంలో నిధులు పక్కదారి పట్టించడంతో గర్భిణుల ప్రసవవేదన వంటి వార్తలు వస్తున్నాయని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో

(సోమవారం) మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు.ఏ ప్రభుత్వమైనా నిధులను పక్కదారి పట్టించవద్దని మంత్రి సీతక్క సూచించారు. ఎస్టీలకు కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని కోరారు. కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గంలో, అదే జిల్లాలో సర్దుబాటు చేయాలి.. తప్ప మైదాన ప్రాంతాలకు తరలించవద్దని ఆకాంక్షించారు. సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టిస్తే ఏజెన్సీ ఏరియా వెనకబాటులోనే మగ్గిపోతుందని తెలిపారు మంత్రి సీతక్క. అందుకే ఎస్టీలకు కేటాయించిన ప్రతి పైసా వారికి ఖర్చు చేయాలని సూచించారు. ఎస్టీల్లో ఎక్కువమందికి ఉండటానికి ఇండ్లు లేవని తెలిపారు. కాబట్టి ఎస్టీల ఇండ్ల నిర్మాణం కోసం బడ్జెట్ నిధులను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. ఎస్టీలకు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కనీస స్థల అర్హతను సడలించాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073